క్లుప్తంగా

23 నుంచి ఆధార్ క్యాంపులు


ఎంపీడీవో శ్రీనివాస్

నాతవరం : మండలంలో ఈనెల 23నుంచి నిర్వహించే ఆధార్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో శ్రీనివాస్ అన్నారు ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 23వ తేదీన **వై.డి.పేట, నరుగుడు,** 24న ఎం.బెన్నవరం, **గొలుగొండపేట, చమ్మ** చింత, 25న నాతవరం**-1, గుమ్మడిగొండ,** 26న గునుపూడి, గన్న**వరం గ్రామాల్లో ప్రత్యే**కంగా ఆధార్ క్యాంపు**లు ఏర్పాటు చేశామన్నా**రు. ఆధార్ కార్డుల**లో ఏమైనా చేర్పులు** మార్పులు ఉంటే ఆ **సమయంలో ఆయా కేం**ద్రాలకు వెళ్లి సరిచేసుకో**వాలన్నారు.**

డి.అగ్రహారం పంచాయతీలో విలీనం చేయాలి


ఎంపీడీవో సాంబశివరావుకు వినతిపత్రం అందిస్తున్న సర్పంచ్ వెంకటరామలక్ష్మి

కె.కోటపాడు : పింద్రంగి **శివారు గ్రామం** డి.పాలెంను దీక్షితుల **అగ్రహారం గ్రామంలో** విలీనం చేయాలని పింద్రంగి గ్రామ సర్పంచ్ జాగరపు వెంకట రామలక్ష్మి, అమ్మతల్లినాయుడు, రెడ్డి లక్ష్మి శనివారం ఎంపీడీవో సాంబశివరావును కలిసి వినతిపత్రం అందించారు. దీనిపై పీజీఆర్ఎస్‌లో ఇచ్చిన వినతి మేరకు ఈ నెల 17న ఎంపీడీవో సాంబశివరావు ఇరు గ్రామాల ప్రజలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పింద్రంగి గ్రామానికి సుమారు 5 కిలోమీటర్లు దూరంలో ఉన్న డి.పాలెం ప్రజలు పడుతున్న ఇబ్బందులను వివరిస్తూ విలీనం కోసం అభ్యర్థించారు.

అపార్ ఐడీ నమోదు చేయించండి


అంగన్‌వాడీల్లో చిన్నారులకు అపార్ ఐడీని నమోదును పరిశీలిస్తున్న పీవో లలితకుమారి

కె.కోటపాడు : అంగన్‌వాడీ కేంద్రాల్లో 3–6 ఏళ్ళ పిల్లలకు తప్పనిసరిగా వారి తల్లులు అపార్ ఐడీని నమోదు చేయించాలని కె.కోటపాడు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారి లలితకుమారి అన్నారు. మండలంలో వారాడ, యడ్లవానిపాలెం గ్రామాల్లో పోషణ మాసోత్సవాలలో భాగంగా డిజిటలైజేషన్ థీమ్ కార్యక్రమంలో అపార్ ఐడీ నమోదుపై వివరించారు. పిల్లలకు అపార్ ఐడీని చేయించడం వల్ల ఆయా కేంద్రాల్లో చదువులు సాగిస్తున్నట్లుగా నమోదు అవడంతో పాటు వారికి పౌష్టికాహారం అందించడం జరుగుతుందని ఆమె తెలిపారు.

ఆయుర్వేద వైద్యంతో వ్యాధులు నయం

మాకవరపాలెం: దీర్ఘకాలిక వ్యాధులను ఆయుర్వేద వైద్యంతో నయం చేయొచ్చని ఆయుర్వేద, మానసిక వైద్య నిపుణులు లావణ్య అన్నారు. పదో ఆయుర్వేద దినోత్సవాన్ని శనివారం తామరం అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ, రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇంట్లో వాడే సాధారణ దినుసులను ఉపయోగించడం ద్వారా రోగాలను దూరం చేసుకోవచ్చన్నారు. నిత్యం ధ్యానం చేయడం వల్ల మానసిక సమస్యలను అధిగమించవచ్చన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ మోహన్‌రావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

గరిశింగిలో 156 మందికి వైద్య పరీక్షలు

దేవరాపల్లి : మండలంలోని గరిశింగిలో స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మహిళల కోసం శనివారం ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహించారు. దేవరాపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి డి.వనజ, ఆయుర్వేద వైద్యాధికారి జి. గ్రీష్మ 156 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. సర్పంచ్ గూడెపు రాము, పీహెచ్‌సీ సిహెచ్‌వో ఎం.ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

సాగునీటి కాలువల అభివృద్ధికి నిధులు

దేవరాపల్లి: రైవాడ జలాశయం పరిధిలోని 10 సాగు నీటి కాలువల అభివృద్ధికి సుమారు రూ. 50 లక్షలు నిధులు మంజూరయ్యాయని ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ పి.పాత్రునాయుడు తెలిపారు. రైవాడ అతిథి గృహంలో సాగునీటి సంఘాల అధ్యక్షులతో శనివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు పరిధిలో 27 పనులు గుర్తించి వాటిని త్వరలో చేపట్టనున్నామని తెలిపారు. కాలువల అభివృద్ధికి జిల్లా కలెక్టర్ ద్వారా మరో రూ. 10 లక్షలు నిధులు మంజూరయ్యాయన్నారు.

ఇంటి పన్నులు శత శాతం వసూలు చేయాలి

నాతవరం: ఇంటి పన్నులు శత శాతం వసూలు చేయాల్సిన బాధ్యత పంచాయతీ కార్యదర్శులపైనే ఉందని మండల ప్రత్యేకాధికారి జి.మంగవేణి అన్నారు. ఆమె మండల పరిషత్ కార్యాలయంలో శనివారం పంచాయతీ కార్యదర్శులతో సమావేశమై మాట్లాడారు. అలాగే డ్రైనేజీలు శుభ్రం చేయుట తాగునీటి పథకాల క్లోరినేషన్ వంటి పనులపై దృష్టి పెట్టాలన్నారు. ఎంపీడీవో శ్రీనివాస్, డిప్యూటీ ఎంపీడీవో మూర్తిబాబు, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

ఆరుగాలం శ్రమించే అన్నదాతకు మిగిలేది స్వేదమే. ముఖ్యంగా కౌలు రైతుకు మట్టిలో బతకడం మినహా ప్రభుత్వం సాయం మాత్రం అందడం లేదు. భూమిలో కష్టపడేది కౌలు రైతైతే, ప్రభుత్వ సంక్షేమం మాత్రం భూ యజమానికి దక్కుతుంది. అప్పులతో చేసిన వ్యవసాయం...వడ్డీకి నైవేద్యం అవుతుంది... ఇదీ కౌలు రైతు పరిస్థితి,


రోలుగుంటలో దుక్కు చేసుకుంటున్న కౌలు రైతులు

కౌలు రైతులకు సాయమేదీ...!

కూటమి ప్రభుత్వం అనాసక్తి
తప్పని అప్పుల వ్యవసాయం
కష్టమంతా వడ్డీ వ్యాపారులకు నైవేద్యం


కొండపాలెంలో గాబు తీసుకుంటున్న రైతు

రోలుగుంట : మండలంలో గల 24 పంచాయతీల పరిధిలో ఉన్న గ్రామాల్లో కౌలు రైతులు అధికంగానే ఉన్నారు. వారిలో వ్యవసాయాధికారి సమాచారం మేరకు సుమారు 328 మంది కౌలు రైతులుగా గుర్తింపు కార్డులు పొందారు. సన్న చిన్నకారు రైతులు మాత్రమే తమకున్న కొద్దిపాటి భూమి చేసుకుంటున్నారు. మరికొంత మంది భూమిని కౌలుకి తీసుకొని సాగు చేస్తున్నారు. పంటకు అవసరమైన ఎరువులు ,విత్తనాలు సమకూర్చుకోవడం దగ్గర నుంచి పంట చేతికి వచ్చేవరకూ పెట్టుబడి కోసం వడ్డీ వ్యాపారులను ఆశ్రయించక తప్పడం లేదు. కౌలు రైతులకు బ్యాంకులు రుణాలు మంజూరుకు అంగీకరించడం లేదు. ఒక వేళ అప్పులు చేసి మదుపులు పెట్టిన తరువాత ప్రకృతివైపరీత్యాల వల్ల పంట నష్టం జరిగితే పంట నష్టం పరిశీలనలో వర్తించే పరిహారం ,అలాగే రాయితీ విత్తనాలు కూడా కౌలు రైతులకు అందడం లేదు. ఒక వేళ కొంతమంది ప్రజాప్రతినిధుల సిఫారసుతో బ్యాంకుకు వెళితేనో కౌలు రైతు అని, లేకుంటే **ఆప్పటికే భూయజమాని పేరున రుణం ఉంది అనే సమాధానం** మినహా సాయం అందడం లేదు. **దీం**తో నిరాశతో వెనుదిరుగుతున్నారు. **కౌలు** రైతులకు చట్టం చేసినా వాటి ఫలా**లు అందడం** గగనమౌతుందని కౌలురైతులు వాపో**తున్నారు.** భూమిని సిద్ధం చేయడం, విత్తనాలు **సేకరణ,** సాగునీరు, ఎరువులు, పురుగు మందులు సమకూర్చుకోవడం వరకూ కౌలు రైతు పరిస్థితి కత్తి మీద సాములా మారుతుంది.

ఆదుకోవాలి...



కౌలు **రైతు**లకు అవగాహన **సదస్సు**లు నిర్వహించాలి . **ఎకరాన్న**ర భూమి కౌలుకి **తీసుకొని** ఈ ఏడాది ఖరీఫ్‌లో **వరి నాట్లు** వేశాను. కౌలు **కార్డు** గురించి అవగాహన **లేదు.** ప్రభుత్వ సంక్షేమాలు, **రుణం** కోసం బ్యాంకుకు **వెళితే పాస్‌పుస్తకం లింకు** పెడుతున్నారు. కౌలుదారుకి పాస్‌పుస్తకం మినహాయింపు ఇచ్చి పంట పరిస్థితి. విస్తీర్ణం ఆధారంగా రుణాలు మంజూరు చేసి ఆదుకోవాలి.

– రుత్తల నాని, కౌలు రైతు, రోలుగుంట

గుర్తింపు కార్డు ఉంటేనే సాయం



అర్హతున్న రైతులకు సాగు చేస్తున్న పంటలకు అర్హతల ధారంగా గుర్తింపు కార్డుల కోసం సిపార్సు చేస్తున్నాం. కౌలు చట్టం అమలులోకి వచ్చినప్పటి నుంచి వారికి గుర్తింపు కార్డుల ఆధారంగా సాగు ధ్రువపత్రాలు ఇస్తున్నాం. ఈ ఏడాది రాయితీపై వరి విత్తనాలు కూడా పంపిణీ జరిగింది. రుణాల గురించి బ్యాంకర్స్‌తో మాట్లాడి అవరమైన చర్యలు తీసుకుంటున్నాం. భూ యజమాని రుణం తీసుకోకుంటే కౌలు గుర్తింపు కార్డున్న రైతులకు రుణాలు ఇప్పించడం జరుగుతుంది. స్థానికంగా ఉన్న బ్యాంకు మేనేజర్‌తో చర్చించాం.

– సిహెచ్.చిరంజీవి, మండల వ్యవసాయాధికారి

అన్నీ కష్టాలే



నాకు ఎకరాన్నర భూమి ఉంది. మరో ఎకరం కౌలుకి తీసుకున్నాను. కూరగాయలు సాగు చేస్తున్నాను. విత్తనాలు, పరుగు మందులు బయట మార్కెట్లో కొనాల్సి వస్తోంది. బ్యాంకురుణం భూయజమాని తీసుకున్నాడు. గుర్తింపుకార్డు 11 నెలల కాలపరిమితే ఉంటుంది. దానిని పునరుద్ధరించుకోవాలి. పునరుద్దరణ అయితేనే ప్రభుత్వం సంక్షేమాలు వర్తిస్తాయి.

– గుర్రం అప్పారావు, రైతు గుర్రాలపాలెం

స్వచ్ఛ మున్సిపాలిటీ సాధనకు కృషి

- మున్సిపల్ చైర్‌పర్సన్ సుబ్బలక్ష్మి


ర్యాలీలో చైర్‌పర్సన్ సుబ్బలక్ష్మి, వివిధ శాఖల అధికారులు

నర్సీపట్నం : ప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛాంధ్ర–స్వర్ణాంధ్ర కార్యక్రమం ద్వారా స్వచ్ఛ మున్సిపాలిటీగా అభివృద్ధి చేసేందుకు పట్టణవాసులు సహకరించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి పిలుపునిచ్చారు. శనివారం స్వచ్ఛాంధ్ర–స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే మనమంతా ఆరోగ్యంగా ఉంటామన్నారు. స్వచ్ఛతకు మున్సిపల్ అధికారులు తీసుకునే కార్యక్రమాలకు సంపూర్ణ మద్దతు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో వి.వి.రమణ, కౌన్సిలర్ సిహెచ్.పద్మావతి, మున్సిపల్ కమిషనర్ జంపా సురేంద్ర, ఏఎంసీ చైర్మన్ గవిరెడ్డి వెంకటరమణ, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు. ఆర్టీసీ కాంప్లెక్స్ అవరణలో స్వచ్ఛాంధ్ర–స్వర్ణాంధ్ర కార్యక్రమంలో పరిసరాలను పరిశుభ్రం చేసి మొక్కలు నాటారు.

అప్పలరాజుపురంలో గాలికుంటు టీకాలు


అప్పలరాజుపురంలో టీకాలు కార్యక్రమం పరిశీలించిన పశువైద్యాధికారి గణేష్‌రెడ్డి

చీడికాడ : మండలంలో జరుగుతున్న గాలి కుంటు వ్యాధి నిరోధక టీకాలు కార్యక్రమంలో భాగంగా, అప్పలరాజుపురం గ్రామంలో జరుగుతున్న ఈ కార్యక్రమాన్ని ఖండివరం పశువైద్యాధికారి ఎ.సి.హెచ్. గణేష్‌రెడ్డి శనివారం పరిశీలించారు. ఈ నెల15వ తేదీ నుంచి జరుగుతున్న ఈ కార్యక్రమంలో భాగంగా, నాలుగు మాసాలు దాటిన ప్రతి పశువుకు విధిగా గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని, దీనివల్ల పశువులకు ఎటువంటి వ్యాధులు దరిచేరవన్నారు. పశువైద్య సహాయకులు ఎం. శ్రీనివాసరావు రైతులు పాల్గొన్నారు.

అందరూ మొక్కలు నాటాలి


కుసుర్లపూడిలో మొక్కలు నాటుతున్న మండల ప్రత్యేకాధికారి నాగజ్యోతి

మాకవరపాలెం: పర్యావరణ పరిరక్షణకు అందరూ మొక్కలు నాటాలని మండల ప్రత్యేక అధికారి రామ్మోహన్‌రావు సూచించారు. లచ్చన్నపాలెంలో శనివారం సచివాలయ ఆవరణలో మొక్కలు నాటారు. ఎంపీడీవో చాయాసుధ, ఎంఈవో మూర్తి, సర్పంచ్ రామలక్ష్మి పాల్గొన్నారు.

రోలుగుంట : మండల ప్రత్యేకాధికారి నాగజ్యోతి శనివారం కుసుర్లపూడిలో గల పాఠశాలలను, చెత్తతో సంపద తయారీశాలలను ఎంపీడీవో నాగేశ్వరరావుతో కలిసి సందర్శించారు. జెడ్పీపాఠశాల, చెత్తతో సంపద తయారీ శాల వద్ద మొక్కలు నాటారు. ఎంఈవో జగ్గారావు, సర్పంచ్ అప్పలనాయుడు పాల్గొన్నారు.

నాతవరం: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు పాటు పడాలని మండల ప్రత్యేకాధికారి మంగవేణి అన్నారు. మండల కేంద్రంలో శనివారం స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ కార్యాలయాల వద్ద మొక్కలు నాటి ప్రతిజ్ఞ చేయించారు. తహసీల్దార్ వేణుగోపాల్, ఎంపీడీవో శ్రీనివాస్, జెడ్పీటీసీ సభ్యురాలు అప్పలనర్స, సర్పంచ్ రాణి, ఎంఈవోలు వరహాలబాబు.బ్రహ్మాజీ, ఏపీవో కొండాజీ పాల్గొన్నారు.

దేవరాపల్లి: గ్రామాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దేందుకు ప్రజలంతా సహకరించాలని దేవరాపల్లి ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మి సూచించారు. ఎ.కొత్తపల్లిలో సర్పంచ్ చింతల సత్య వెంకటరమణ ఆధ్వర్యంలో స్వచ్ఛోత్సవ్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. సంపద తయారీ కేంద్రం ఆవరణలో మొక్కలు నాటారు. పంచాయతీ కార్యదర్శి ఉదయ్‌భాస్కర్ పాల్గొన్నారు.

రావికమతం: స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం మేడివాడ హైస్కూల్‌లో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ప్రత్యేక అధికారి సుజాత, ఎంపీడీవో మహేష్, డిప్యూటీ ఎంపీడీవో సీతారామస్వామి, సర్పంచ్ లీలా శివ పాల్గొన్నారు.

చీడికాడ : ఖండివరంలో జరిగిన స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో సీడీసీ చైర్మన్ సుంకర శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యురాలు గెంజి స్వాతి, కోఆప్షన్ సభ్యుడు షేక్ సూర్యనారాయణ, సుంకర కొండబాబు పాల్గొన్నారు. అర్జునగిరిలో సర్పంచ్ రమాదేవి పాల్గొన్నారు.

గొలుగొండ: పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే అంతా ఆరోగ్యంగా ఉంటారని మండల ప్రత్యేక అధికారి ఎంపీఎస్ మూర్తి తెలిపారు. గొలుగొండలో శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు.

కె.కోటపాడు : మొక్కలను ప్రతీ ఒక్కరూ నాటి వాటి పెంపకాన్ని బాధ్యతగా గుర్తించాలని డ్వామా పీడీ, మండల ప్రత్యేకాధికారి ఆర్.పూర్ణిమాదేవి అన్నారు. వారాడలో స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో శనివారంపాల్గొన్నారు. ఈ సందర్భంగా పూర్ణిమాదేవి గ్రామ పెద్దలతో కలిసి మొక్కలను నాటారు.

క్యాన్సర్‌పై అప్రమత్తంగా ఉండాలి

మాకవరపాలెం: క్యాన్సర్ వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలని మాకవరపాలెం, బూరుగుపాలెం వైద్యాధికారులు సీతారామలక్ష్మి, చరిష్మ కోరారు. మండలంలోని జీ.వెంకటాపురం, పాపయ్యపాలెం సచివాలయల వద్ద శనివారం ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. ముఖ్యంగా మహిళల్లో వచ్చే వివిధ క్యాన్సర్ లక్షణాలపై అవగాహన కల్పించా రు. పాపయ్యపాలెంలో అంగన్‌వాడీ సిబ్బంది ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్‌ను ఐసీడీఎస్ పీడీ సూర్యకుమారి సందర్శించి మహిళలు, కిషోర బాలికలకు అవగాహన కల్పించారు. సీడీపీవో రమణి, సీహెచ్‌వో రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

మాడుగుల రూరల్: ముకుందపురం గ్రామంలో శనివారం మహిళల కోసం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. వద్దాది పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఎన్. మాధవి 120 మందికి మహిళలకు వైద్య సేవలు అందించారు. ప్రధానంగా మహిళలకు క్యాన్సర్ పరీక్షలు నిర్వహించారు. మాతా శిశు సంక్షేమ పథకాలు గురించి అవగాహన కల్పించారు. సర్పంచ్ కర్రి గణేశ్, ఆరోగ్య పర్యవేక్షకురాలు అమ్మాజీ పాల్గొన్నారు. మాడుగుల మూడో ఆరోగ్య ఉప కేంద్రం పరిధిలో మహిళల కోసం ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేసారు. కె.జె.పురం పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ ఎల్.వి.ఎస్.ఎస్.ప్రసాదుపాత్రుడు, డాక్టర్ సందీప్ ఆధ్వర్యంలో సుమారు 150 మంది మహిళలకు ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కమ్యూనిటీ హెల్త్ అధికారి సుజాత, పీహెచ్ఎన్ ఇందిర, హెచ్‌వీలు పుష్పకాంతం, వెంకట్రావుతో పాటు ఏఎన్ఎంలు, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రావికమతం: స్వస్త్ నారీ,స్వసక్త పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా చినపాచిల గ్రామంలో శనివారం మహిళలకు ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ పుష్పలత 215 మంది మహిళలకు వైద్య సేవలు అందించారు. మధుమేహం, బీపీ, క్యాన్సర్ పరీక్షలు నిర్వహించారు. సర్పంచ్ కోమటి రామలక్ష్మి,ఉప సర్పంచ్ శంకరరావు, రావికమతం పీహెచ్‌సీ సీహెచ్‌వో హేమసుందర్, హెచ్ఎస్ సత్యనారాయణ, అంగన్‌వాడీ కార్యకర్తలు,ఏఎన్ఎంలు పాల్గొన్నారు.


సూదివలసలో మందులు అందిస్తున్న ఎంపీటీసీ రామునాయుడు, వైద్యాధికారి శశి ప్రియాంక

కె.కోటపాడు : మహిళల ఆరోగ్యం మెరుగుకు నిర్వహిస్తున్న స్వస్త్ నారి స్వశక్త్ పరివార్ అభియాన్ వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూదివలస ఎంపీటీసీ, వైఎస్సార్‌సీపీ నాయకుడు వర్రి రామునాయుడు తెలిపారు. లంకవానిపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి శశి ప్రియాంక 129 మంది మహిళలకు సాధారణ వైద్య పరీక్షలతో పాటు క్యాన్సర్‌లపై నిర్ధారిత పరీక్షలను జరిపారు. వీరికి మందులను ఎంపీటీసీ రామునాయుడు చేతుల మీదుగా అందజేశారు.

రోడ్లపై చెత్త వేస్తే భారీ జరిమానా


కాశీపురంలో దుకాణాలను తనిఖీ చేస్తున్న డీఎల్‌డీవో మంజులవాణి, ఎంపీడీవో సువర్ణరాజు

దేవరాపల్లి: రోడ్లపై చెత్తాచెదారాలను వేసే దుకాణాదారులకు భారీ మొత్తంలో జరిమానా విధిస్తామని డీఎల్‌డీవో, మండల ప్రత్యేక అధికారి ఎస్. మంజులవాణి హెచ్చరించారు. మండలంలోని కాశీపురంలో స్వచ్ఛాంధ్ర–స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం పర్యటించారు. వీధుల్లో పర్య టించి తడి చెత్త, పొడి చెత్తను హరిత రాయబారులకు అందించాలని గ్రామస్తులకు సూచించారు. గ్రామంలో కొందరు దుకాణదారులు చెత్తాచెదారా లను, ప్లాస్టిక్ వ్యర్థాలను ఇష్టానుసారం పడేయడా న్ని గమనించి ఆమె వారిని తీవ్రంగా హెచ్చరించడంతో పాటు ఒక్కొక్కరికి రూ. 2500 నుంచి రూ. 10వేలు వరకు జరిమానాను విధించారు. అనంతరం శ్మశాన వాటిక, చెత్త సంపద కేంద్రం వద్ద మొక్కలను నాటారు. ఎంపీడీవో సువర్ణరాజు, డిప్యూటీ ఎంపీడీవో కిరణ్‌వరప్రసాద్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కె.చంద్రశేఖర్, హౌసింగ్ ఏఈ భవ్యతేజ, పశువైద్యాధికారి మంజుషారాణి, సర్పంచ్ వరలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి ఉమాదేవి, స్వచ్ఛ భారత్ మండల కోఆర్డినేటర్ త్రినాథ్ పాల్గొన్నారు.

వైద్య విద్య ప్రైవేటీకరణ అన్యాయం


కాళ్ల రాము

మాడుగుల రూరల్: గత ప్రభుత్వ హయాంలో మంజూరైన 17 ప్రభుత్వ వైద్య కళాశాలలును పీపీపీ విధానం ద్వారా పేద విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేయడమే ప్రభుత్వ కుట్రని సీనియర్ వైఎస్సార్‌సీపీ నాయకుడు, కె.జె.పురం మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు కాళ్ల రాము అన్నారు. శనివారం ఆయన సాక్షితో మాట్లాడారు. ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటీకరణ చేస్తే, పేద, మధ్యతరగతి వారు తీవ్రంగా నష్టపోతారన్నారు. దేశ చరిత్రలో మంజూరైన మెడికల్ సీట్లు మాకు వద్దంటూ తిరిగిన ఎన్ఎంసికి లేఖ రాసిన, మొదటి ప్రభుత్వం చంద్రబాబుదేనని, కూట మి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మిగిలిన కొద్దిపాటి పనులు కొనసాగించి వుంటే గత ఏడాది మరో 5 కళాశాలలు నిర్మా ణం పూర్తి అయ్యాయని, 750 మెడికల్ సీట్లు అందుబాటులోకి వచ్చేవని అన్నారు. ఈ పనులు చేయకుండా దుష్ప్రచారం చేయడం దారుణమన్నారు. ప్రస్తుత సీఎం చంద్రబాబు తన 14 సంవత్సరాలు పాలనలో ఒక్క మెడికల్ కళాశాలను కూడా మంజూరు చేయించలేదని, కేంద్రంలో ఎన్‌డీఏ ప్రభుత్వంలో భాగస్వాములై ఉన్న కూటమి ప్రభుత్వం వెంటనే ప్రభుత్వ రంగంలో మెడికల్ కళాశాలలను మంజూరు చేయించాలన్నారు.

ఉత్తమ బోధనకు చక్కని ప్రణాళికలు


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌జేడీ విజయకుమార్

రోలుగుంట: ఉత్తమ బోధన, పాఠశాల నిర్వహణపై ప్రణాళికలు తయారు చేసుకోవడం ఉపాధ్యాయుల విధుల్లో కీలకమని మండల విద్యాశాఖాదికారి పూడి జగ్గారావు అన్నారు. బుచ్చింపేట, రోలుగుంట, కుసుర్లపూడి జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో నెల వారీ కాంప్లెక్సు సమావేశాలను ఆయా క్లస్టర్‌ల హెచ్.ఎంలు శనివారం నిర్వహించారు. కుసుర్లపడి క్లస్టర్ సమావేశాన్ని ఎంఈవో జగ్గారావు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాఠశాల ప్రగతి గురించి తెలుసుకొనేందుకు నోడల్ పర్సన్స్, ఎంఈవోలు, జిల్లా విద్యాశాఖాధికారి డీవైఈవో, ఏపీసీ, జిల్లా సమగ్ర శిక్షా, తిరుపతి కార్యాలయం నుంచి సెక్టోరియల్ అధికారుల పర్యవేక్షణ ఉంటుందన్నారు. నోడల్ పర్సన్ శెట్టి మోహన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నాతవరం : విద్యార్థుల పట్ల ఉపాధ్యాయులు బాధ్యతగా వ్యవహరించాలని విద్యాశాఖ ఆర్‌జేడీ కె.విజయకుమార్ అన్నారు. నాతవరం హైస్కూల్‌ను శనివారం ఆకస్మికంగా తనిఖీ చేసి విద్యార్థులతో మాట్లాడారు. మండల కేంద్రంలో నిర్వహిస్తున్న ఉపాధ్యాయులకు స్కూల్ కాంప్లెక్సు కార్యక్రమంలో పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్య విధానంలో నూతనంగా తీసుకువచ్చే అంశాలపై ఉపాధ్యాయులకు వివరించారు.

రూ.200 కోట్ల టర్నోవర్ లక్ష్యం

చోడవరం: జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ ద్వారా సకాలంలోనే అన్ని రకాల రుణాలు ఇచ్చే విధంగా చర్యలు చేపట్టామని డీసీసీబీ చైర్‌పర్సన్ కోన తాతారావు అన్నారు. చోడవరం బ్రాంచ్ రూ.170 కోట్లు టర్నోవర్ చేరుకున్న సందర్భంగా శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా బ్రాంచ్ ఆవరణంలో మొక్కలు నాటారు. అనంతరం స్వయంభూ విఘ్నేశ్వర స్వామిని దర్శించుకున్నారు. చోడవరం బ్రాంచ్ రూ. 200కోట్లు టర్నోవర్ చేరుకునే విధంగా నిర్దేశించుకోవాలని చైర్‌పర్సన్ సూచించారు. రైతులకు, అన్ని వర్గాల వారు రుణం కోసం వస్తే సకాలంలో వారికి సేవలు అందించాలన్నారు. డీసీసీబీ సీఈవో డి.వి.ఎస్ వర్మ, బ్రాంచి మేనేజర్ శ్రావణ్ చోడవరం పీఏసీఎస్ అధ్యక్షుడు మల్లునాయుడు పాల్గొన్నారు.

ఎన్ఎంఎంఎస్ మెటీరియల్ పంపిణీ

దేవరాపల్లి : వేచలం, కలిగొట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఎన్ఎంఎంఎస్ స్టడీ మెటీరియల్‌ను అమ్మ చారిటబుల్ ట్రస్టు సభ్యులు వితరణ చేశారు. పాఠశాలలో 8వ తరగతి చదువుతూ ఎన్ఎంఎంఎస్ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు కలిగొట్ల హెచ్ఎం సురేష్, వేచలం హెచ్ఎం వెంకటరావు సమక్షంలో శనివారం స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. ట్రస్టు చైర్మన్ వెంకటరావు, సభ్యులు శేషగిరిరావు, వెంకటరావు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం

మాడుగుల రూరల్: పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా గర్భిణులు, బాలింతలుకు సంపూరణ ఆరోగ్య చేకూరుతుందని, ముకుందపురం సర్పంచ్ కర్రి గణేష్ అన్నారు. 8 వ రాష్ట్రీయ పోషణ వారోత్సవాలు సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని సర్పంచ్ ప్రారంభించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఈశ్వరమ్మ మాట్లాడుతు చిన్నార్లుల్లో స్థూలకాయం నివారణకు నూనె వినియోగం తగ్గించాలని, బాల్య దశలో పోషణ, విద్య గురించి, శిశు సంక్షేమ పథకాలు వివరించారు.

సమన్వయంతో పనిచేయాలి

రావికమతం: అధికారులు సమన్వయంతో పనిచేయాలని మండల ప్రత్యేకాధికారి టి. సుజాత అన్నారు. నర్సీపట్నం డివిజన్ అసిస్టెంట్ లేబర్ కమిషనర్‌గా పనిచేస్తున్న ఆమెను మండల ప్రత్యేకాధికారిగా నియమించడంతో శనివారం సాయంత్ర అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశమయ్యారు. వివిధ శాఖలు గురించి సమీక్షించారు.

వారాడలో యూరియా పంపిణీ


యూరియా పంపిణీ రికార్డులను తనిఖీ చేస్తున్న మండల ప్రత్యేకాధికారి పూర్ణిమాదేవి


కె.కోటపాడు : ప్రభుత్వం రాయితీపై రైతులకు అందిస్తున్న యూరియా పంపిణీని పారదర్శకంగా నిర్వహించాలని మండల ప్రత్యేకాధికారి ఆర్.పూర్ణిమాదేవి తెలిపారు. వారాడ రైతు సేవా కేంద్రంలో శనివారం పంపిణీ చేస్తున్న యూరియాను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇప్పటివరకూ వారాడ రైతు సేవా కేంద్రానికి 24 టన్నుల యూరియా, వి.సంతపాలెం రైతు సేవా కేంద్రానికి 12 టన్నుల యూరియాను అందించినట్లు వ్యవసాయాధికారి సోమశేఖర్ తెలిపారు. సర్పంచ్ సౌజన్య, వైస్ ఎంపీపీ లెక్కల నాగ విజయలక్ష్మి పాల్గొన్నారు.


బీఎన్ రోడ్డులో కూరగాయాల ఆటో బోల్తా


బంగారుమెట్ట,వడ్డాది మధ్యన బోల్తా పడిన ఆటో

బుచ్చెయ్యపేట: భీమునిపట్నం,నర్సీపట్నం(బిఎన్) రోడ్డులో కూరగాయలతో వెళ్తున్న ఆటో బోల్తా పడింది. వడ్డాదికి చెందిన పలువురు చిరు వ్యాపారులు కూరగాయలు కొనుగోలు చేసి అమ్మకాలతో జీవనం సాగిస్తున్నారు. అనకాపల్లిలో ఉదయాన్నే జరిగే సంతలో రైతుల నుండి కూరగాయలు కొనుగోలు చేసి వడ్డాదిలో అమ్మకాలు చేసి ప్రతి రోజూ ఉపాధి పొందుతున్నారు. ప్రతి రోజులాగే శనివారం ఉదయం అనకాపల్లి వెళ్లి కూరగాయలు కొని వడ్డాది తిరిగి వస్తుండగా ఆటో ప్రమాదానికి గురైంది. బంగారుమెట్ట పోలమాంబ గుడి వద్ద గోతిలోకి దిగిన కూరగాయల ఆటో బోల్తా పడింది. దీంతో టమాటాలు,వంకాయలు,బీరకాయలు,ఉల్లిపాయలు,పచ్చిమిర్చి తదితర కూరగాయల మూటలు బురదలో రోడ్డుపై చిందరవందరగా పడిపోయాయి. పలు కూరగాయల బస్తాలు చిరిగిపోయాయి. వేలాది రూపాయలతో కొనుగోలు చేసిన కూరగాయలు బురదలో పడిపోవడంతో వ్యాపారులకు తీవ్ర నష్టం జరిగిందని వాపోయారు. బీఎన్ రోడ్డులో గోతుల వల్ల తరుచూ ప్రమాదాలు జరుగుతున్న ఆర్అండ్‌బి అధికారులు పట్టించుకోవడం లేదని మండిపడుతున్నారు.

శరన్నవరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు


ప్రత్యేక అలంకరణలో కనకదుర్గమ్మవారు


తాచేరు నది ఒడ్డున్న గల కనకదుర్గమ్మ ఆలయం

మాడుగుల రూరల్: వంటర్లపాలెం గ్రామంలో తాచేరు నది ఒడ్డున గల కనకదుర్గమ్మ ఆలయంలో శరన్నవ రాత్రి ఉత్సవాలు ఈ నెల 22 వ తేదీ నుంచి నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ఉత్సవాలు వచ్చే నెల 2 వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు గురుభవానీ దండి నర్సింగరావు స్థానిక ప్రజాప్రతినిధులు శనివారం తెలిపారు. 22 న భవానీ భక్తులు ఘటాలతో గ్రామం నుంచి ఆలయానికి ఊరేగింపుగా వచ్చి పూజలు నిర్వహిస్తారని తెలిపారు. అదే రోజు భవానీ భక్తులకు అన్నసమారాధన జరుగుతుందన్నారు. ఈ ఏడాదికి ఆలయం నిర్మించి నాలుగు సంవత్సరాలు కావస్తుందని తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా బాణసంచాను చోడవరంనకు చెందిన ఉప్పల సతీష్ అనే వ్యాపారి ఉచితంగా అందజేస్తున్నారన్నారు. స్థానికులు సకలా సూరిబాబు మాట్లాడుతూ ఈ నెల 22 వ తేదీ నుంచి 11 రోజుల పాటు ఆలయంలో ఉదయం, సాయంత్రం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహిస్తామన్నారు.